హామీలు వదిలేసి..
గొడవలు రాజేసి..

ఎన్నికల వేళ మోసపూరిత హామీలిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెట్టిస్తామన్నారు. ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి గెలిచాక హామీలు అమలు వదిలేసి.. వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు, దౌర్జన్యాలకు తెరలేపారు. ఇదీ తాడిపత్రిలోని పరిస్థితి.





ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి అనుచరుల దాడిలో ధ్వంసమైన వైఎస్సార్‌సీపీ నేతల వాహనాలు (ఫైల్)

- వంద రోజుల పాలనలో దాడులకే ప్రాధాన్యం
- హామీలు నెరవేర్చని ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి

తాడిపత్రి: తాడిపత్రి అభివృద్ధే ధ్యేయం .. మన ఊరును బాగు చేసుకుందాం.. యువతను చైతన్యవంతులను చేసి, నియోజకవర్గ అభివృద్ధిలో వారిని భాగస్వాములను చేస్తాం అంటూ జేసీ అస్మిత్ రెడ్డి హామీలు గుప్పించారు. అలాగే సూపర్ సిక్స్ హామీల ద్వారా ప్రజలకు ఎనలేని మేలు కలుగుతుందని, టీడీపీని గెలిపించాలని ఓట్ల కోసం అమలు చేయలేని హామీలను ఎడాపెడా ఇచ్చారు. ఆపై ఎన్నికలు ముగిశాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. తాడిపత్రి నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యేగా జేసీ అస్మిత్‌రెడ్డి గెలుపొందారు. వంద రోజుల పాలన పూర్తయినా ఒక్క హామీ కూడా అమలు చేయకపోవడంతో నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే తండ్రి జేసీ ప్రభాకర్‌రెడ్డి బాటలో నడుస్తూ తాడిపత్రి నియోజకవర్గంలో గొడవలకు ఆజ్యం పోశారు. నియోజకవర్గంలో పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై టీడీపీ శ్రేణులు దాడులకు దిగడం, వారి ఆస్తులను ధ్వంసం చేయడం, పొలాల్లోని చెట్లను నరకడం వంటి దౌర్జన్యాలు పెరిగాయి. లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా అమలు చేయడమే టీడీపీ నాయకులు పనిగా పెట్టుకుని పాలన సాగిస్తున్నారు తప్ప ప్రజారంజక పాలన వైపు కాసింత చర్యలు తీసుకున్నట్లుగా పాలకులు లేరన్న విషయం సుస్పష్టంగా తెలుస్తోందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ప్రచారంలో జేసీ అస్మిత్‌రెడ్డి హామీలు ఇలా...

నియోజకవర్గంలోని ముఖ్యమైన చెరువులకు నీటిని అందించడంతో పాటు, చాగల్లు, పెండేకల్లు రిజర్వాయర్ల ద్వారా కాలువలకు నీరు సరఫరా చేసి, రైతులకు సాగు నీరు అందిస్తామన్నారు. తాడిపత్రిలో అండర్ డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంతో పాటు, మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. గూడు లేని పేద ప్రజలకు టిడ్కో ఇళ్లను కేటాయిస్తామన్నారు. పెద్దవడుగూరు మండలంలో ఫైర్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. వీరన్నపల్లి నుంచి పామిడికి వెళ్లే రహదారిలోని పులేరు వాగు కోతకు గురికాకుండా రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు బ్రిడ్జిని నిర్మిస్తామన్నారు. భీమునిపల్లి నుంచి ముప్పాళ్ల గుత్తికి ప్రధాన రహదారిగా తారు రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే కొట్టాలపల్లి, రామరాజుపల్లి, చిత్రచేడు, చిట్టూరు, కోనాపురం, రావులుడికి , చింతల చెరువు, ముప్పాళ్ల గుత్తి, భీమునిపల్లి, మిడుతూరు తదితర గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అలాగే యాడికి మండలంలోని రాయల చెరువు చెరువును నీటితో నింపడంతో పాటు, యాడికి కాలువకు సాగు నీరందిస్తామన్నారు. అదేవిధంగా మండలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



ముళ్ల చెట్లతో నిండి, చుక్క నీరు లేకుండా దర్శనమిస్తున్న యాడికి కెనాల్



పెద్దవడుగూరు మండలంలో పులేరు వాగు వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపడతామన్న ప్రదేశం



భీమునిపల్లి నుంచి ముప్పాళ్లగుత్తికి వెళ్లే రహదారి దుస్థితి ఇది..

నియోజకవర్గ సమాచారం



మండలాలు - తాడిపత్రి, యాడికి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు
జనాభా - 3,55,818
ఓటర్లు - 2,48,880

చెరువులకు నీరివ్వండి



యాడికి మండలంలోని రాయలచెరువు గ్రామంలో చెరువుకు, యాడికి కాలువకు నీరివ్వండి. వాటికి నీరు అందిస్తే భూగర్భ జలాలు పెరిగి రైతులకు మేలు చేకూరుతుంది. వంద రోజుల పాలనలో మీరిచ్చిన మాటను నిలబెట్టుకుని ఉంటే ఇప్పటికే చెరువుకు, కాలువకు నీరు వచ్చి ఉండేది. రాయల చెరువు నుంచి దైవాలమడుగుకు రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. ఇంత వరకూ ఆ పనుల ఊసేలేదు.

– ముత్యాలరెడ్డి, రైతు, తూట్రాళ్లపల్లి, యాడికి మండలం

రైతులను ఆదుకోవాలి



రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని జేసీ అస్మిత్‌రెడ్డి ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. వంద రోజుల పాలనలో ఎమ్మెల్యే రైతులను పట్టించుకున్న పాపాన పోలేదు. వర్షాలు సరిగా పడక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాలువల్లో పూడిక తీత పనులు కూడా చేపట్టలేకనే వంద రోజుల పాలన ముగిసింది. కాలువల ద్వారా ఆయకట్టుకు సాగునీరందించి రైతులను ఆదుకోవాలి.

– పెద్ద కుళ్లాయిబాబు, రైతు పెద్దవడుగూరు.

పాలన చేత కాదు



ఎన్నికల్లో గెలిచేందుకు ఇష్టానుసారంగా కరపత్రాలు పంపిణీ చేయించారు. అభివృద్ధి అంటే ఏంటో చూపుతాం. నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరిస్తామంటూ తండ్రి, కొడుకు హామీలిచ్చారు. ఎన్నికల్లో గెలుపొందగానే హామీలను పక్కన పెట్టారు. చెరోదారి తిరుగుతున్నారు తప్ప ప్రజలకు మంచి పాలనను అందించేందుకు కృషి చేయడం లేదు. వారిని నమ్మి గెలిపించిన ప్రజలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు, నియోజకవర్గానికి ఏం చేశారో ధైర్యంగా చెప్పలేని స్థితిలో ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి ఉన్నారు.

– కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాజీ ఎమ్మెల్యే

క్లుప్తంగా

వెండి యజ్ఞోపవీతం వితరణ



కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి యజ్ఞోపవీతం అందజేస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఆదివారం అనంతపురానికి చెందిన ద్వారక చంద్రమోహన్‌రెడ్డి, భారతి దంపతులు, హరినాథ్ రెడ్డి, చంద్రిక దంపతులు వారి కుటుంబ సభ్యులు కలసి రూ.39,900 విలువ చేసే 24.89 తులాల వెండి యజ్ఞోపవీతం వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకుడు రామాచార్యులు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పెట్టుబడి సాయం అందించాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

పెద్దవడుగూరు: హామీ మేరకు కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం రూ. 20 వేలు అందించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్ర శేఖర్, మండల కార్యదర్శి దస్తగిరి డిమాండ్ చేశారు. ఈ నెల 25న రైతుల సమస్యలపై కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నా విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం స్థానిక బస్టాండ్ వద్ద కరపత్రాలను విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. 2023 ఖరీఫ్, రబీ పంటలకు బీమా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మద్దిలేటి, నరసమ్మరాముడు, నారాయణ, సుంకన్న, మస్తాన్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి అడుగు జాడల్లో నడవాలి



మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నాయకులు

గుత్తి: వాల్మీకి మహర్షి అడుగుజాడల్లో నడవాలని వాల్మీకి సంఘం నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఆదివారం వాల్మీకి సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఆ సంఘం నాయకులు బాచి, వేణు, సుధాకర్, వాసు, సందీప్, రమేష్, ప్రతాప్, సుంకన్న తదితరులు మాట్లాడుతూ వాల్మీకులందరూ వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అక్టోబర్ 17న వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహిస్తామన్నారు. జయంతి రోజున సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. వాల్మీకులందరూ తప్పకుండా హాజరై జయప్రదం చేయాలని కోరారు.

డిప్యూటీ తహసీల్దార్ బదిలీ

యల్లనూరు: డిప్యూటీ తహసీల్దార్ శ్వేతను కలెక్టర్ వినోద్‌కుమార్ పెద్దపప్పూరు మండల తహసీల్దారు కార్యాలయానికి బదిలీ చేశారు. శ్వేత యల్లనూరు మండలంలో రెండేళ్లుగా సేవలందించారు. అలాగే పెద్దపప్పూరు డిప్యూటీ తహసీల్దార్ మహబూబ్ బాషాను యల్లనూరు తహసీల్దారు కార్యాలయానికి బదిలీ చేశారు. అలాగే యల్లనూరు ఆర్ఐ హరిప్రసాద్‌ను గుంతకల్లు తహసీల్దారు కార్యాలయానికి బదిలీ చేయగా దీర్ఘకాలిక సెలవులో ఉన్న ఆర్ఐ చిన్ననారాయణమ్మను యల్లనూరు ఆర్ఐగా నియమించారు. త్వరలో వీరందరూ విధుల్లో చేరనున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే జయరామ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 2వ వార్డు సంజీవనగర్‌లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం 100 రోజుల్లో అమలు చేసిన పథకాలను ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా వరద బాధితుల సహాయార్థం మెప్మా పట్టణ సమాఖ్య తరపున రూ.2.10 లక్షల చెక్కును ఎమ్మెల్యేకు మెప్మా అధికారులు, మహిళలు అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటరమణయ్య, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, సీఎంఎం భవాని, కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సగర ఉప్పర కులస్తుల కార్యవర్గం ఏకగ్రీవం



సగర ఉప్పర కమిటీని అభినందిస్తున్న కులస్తులు

పామిడి: పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం సగర ఉప్పర కులస్తుల మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ మండల గౌరవాధ్యక్షులుగా శ్రీధర్, వెంకటనారాయణ, మస్తానయ్య, కొండయ్య, అధ్యక్షుడిగా శ్రీసాయి హాస్పిటల్ అధినేత చిలక రాజుగోపాల్, ఉపాధ్యక్షులుగా రాఘవ, సూరి, నక్కా ఓబుశేసు, పట్టణ ఉపాధ్యక్షుడిగా లీలా మనోహర్, ప్రధాన కార్యదర్శిగా రాఘవేంద్ర, కార్యదర్శులుగా రామకృష్ణ, గురుదాస్, సుంకిరెడ్డి, హరి, ధనుంజయ, ఓబుళపతి, ట్రెజరర్‌గా వంగనూరు విశ్వనాథ్ ఎన్నికయ్యారు. సంఘం అభ్యున్నతికి పాటుపడతామని ఈసందర్భంగా నూతన కమిటీ పేర్కొంది. వందరోజుల్లో భగీరథ మహర్షి విగ్రహ ఏర్పాటుకు కులస్తులందరూ సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఓబుళాపురం సర్పంచ్ వై సూర్యనారాయణ. దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

సంగీతంపై ఆసక్తి పెంచుకోవాలి



సంగీత శిక్షణ ఇస్తున్న దృశ్యం

గుంతకల్లు: ప్రతి ఒక్కరూ సంగీతం పట్ల ఆసక్తి పెంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని పద్మశ్రీ ఘంటసాల కల్చరల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మ్యూజిక్ తరగతులను ప్రారంభించారు. అనంతపురానికి చెందిన బాబ్జి మ్యూజిక్ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకుడు బాబ్జి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, రైల్వే హైస్కూల్ హెచ్‌ఎం మధుసూదన్, సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, బి.సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.



బేతాపల్లిలో కొట్టుకుపోయిన పంటను చూపుతున్న రైతు నెల్లూరప్ప



గుత్తిలో వర్షానికి కూలిన గౌతమేశ్వర ఆలయ ప్రహరీ

గుత్తిలో భారీ వర్షం

గుత్తి/గుత్తిరూరల్: గుత్తిలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. 90.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ ఓబిలేసు తెలిపారు. భారీ వర్షం కారణంగా జన జీవనం అస్తవ్యస్తమైంది. చెట్నేపల్లిలోని జగనన్న కాలనీ జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఎంఎస్ ఫుట్ బాల్ క్రీడామైదానం కుంటను తలపించింది. ఎల్‌ఎం బాలుర పాఠశాలలోకి వర్షం నీరు చేరింది. బసినేపల్లి, బాచుపల్లి, వన్నేదొడ్డి, ఊబిచెర్ల, ధర్మాపురం, బేతాపల్లి, యంగన్నపల్లి, లచ్చానుపల్లి గ్రామాల్లో భారీగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. బేతాపల్లి గ్రామంలో రైతు నెల్లూరప్ప 3.5 ఎకరాల్లో సాగుచేసిన వేరుశనగ పంట భారీ వర్షానికి కొట్టుకుపోయింది. సుమారు రూ.60 వేలు నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

కుప్పకూలిన గౌతమేశ్వర ఆలయ ప్రహరీ

శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గుత్తి ఆర్ఎస్‌లోని గౌతమేశ్వర ఆలయ ప్రహరీ కుప్పకూలింది. సుమారు రూ.ఐదు లక్షలు నష్టం వాటిల్లినట్లు ఆలయ కమిటీ చైర్మన్ శేఖర్ రెడ్డి తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రహరీ పునః నిర్మించాలని ఆయన కోరారు.

నీటి విడుదలలో ప్రభుత్వ నిర్లక్ష్యం

పుట్లూరు: చెరువులకు నీరు విడుదల చేసే విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని ఏపీ కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు సత్తార్ గోపాల్, క్రిష్టుడు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భారీ వర్షాలతో ప్రాజెక్టులకు పూర్తి స్థాయిలో నీరు వచ్చినప్పటికీ చెరువులకు ఇప్పటి వరకూ నీరు విడుదల చేయలేదన్నారు. మండలంలోని సుబ్బరాయసాగర్‌తో పాటు పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులకు, యల్లనూరు మండలం బొప్పేపల్లి చెరువుకు నీటిని సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఘనంగా ఆరాధనోత్సవం



పామిడిలోని సీఎస్ఐ చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్

పామిడి: మండలంలోని అన్ని చర్చిల్లో ఆదివారం ఆరాధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన ఆరాధన కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ ప్రసంగించారు. దేవుడు ప్రేమ స్వరూపి అన్నారు. బీదల పట్ల దేవుడికి కలిగి ప్రేమను మనమూ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు వీరయ్య, జయరాజు, జకరయ్య, అబ్రహాం, రాజు, ప్రసాద్, రజని, చంద్రకళ, కమలమ్మ, మెర్సీ, డాక్టర్ కమల, ప్రశాంతి, మాణిక్యమ్మ, రేచెల్, వాణి పాల్గొన్నారు.

కురుబలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి



మార్కెట్ యార్డు చైర్మన్ పదవి కేటాయించాలని ఎంపీ, ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కురుబ సంఘం నాయకులు

గుంతకల్లు: నామినేటెడ్ పోస్టుల్లో కురుబలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు కురుబ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. స్థానిక బీరప్పగుడి సమీపంలోని కురుబ కల్యాణమండపంలో ఆదివారం నియోజకవర్గ కురుబ సంఘం ఆధ్వర్యంలో ఎంపీ, ఎమ్మెల్యేకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. కనకదాస కాంస్య విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని, గుంతకల్లు, గుత్తి, పామిడిల్లో కనకదాస కల్యాణ మండపాలు నిర్మించాలన్నారు. సీపీఐ నాయకుడు జగదీష్ మాట్లాడుతూ తిరుమలలో కురుబలకు ప్రత్యేక సత్రం ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. కురుబ సంఘం సాధికార జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ గుంతకల్లు మార్కెట్ యార్డు చైర్మన్ పదవి గత 30 ఏళ్లుగా కురబ కేటాయించలేదని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది కురుబలకు కేటాయించాలని ఎంపీ, ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. కురుబలకు చేయూతనిస్తామని ఎంపీ, ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కురుబ సంఘం పట్టణ అధ్యక్షుడు సోమశేఖర్, జెడ్పీటీసీ కదిరప్ప, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, బండారు ఆనంద్, ముస్టూరు భాస్కర్, కురుబ సంఘం నాయకులు పాలమల్లికార్జున, కేశప్ప తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఎంతో ఎంపీ, ఎమ్మెల్యే బేటీ..

జిల్లాలో రైల్వే సమస్యలను పరిష్కరించాలని డీఆర్ఎం విజయ్‌కుమార్‌కు ఎంపీ అంబికా, ఎమ్మెల్యే జయరాం విజ్ఞప్తి చేశారు. ఆదివారం డీఆర్ఎంను వారు కలిశారు. గుంతకల్లు పట్టణంలోని ధర్మవరం రైల్వే గేట్ వద్ద ఆర్‌యూబీ నిర్మాణం, కసాపురం రైల్వే మోరీ విస్తరణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. అదేవిధంగా జిల్లా కేంద్రం అనంతపురంలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌ను గుంతకల్లు మీదుగా మళ్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

యల్లనూరు: ఈ-కేవైసీ గడువు సోమవారం ముగుస్తుందని ఏఓ రామకృష్ణుడు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో 150 మంది రైతులు ఈ-కేవైసీ చేసుకోలేదని, తక్షణమే చేయించుకోవాలన్నారు. ఈ-కేవైసీ చేసుకోని రైతులు ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీకి అనర్హులన్నారు.

20 లీటర్ల నాటుసారా స్వాధీనం

పెద్దపప్పూరు: మండలంలోని కుమ్మెత గ్రామంలో నాటుసారా ప్యాకెట్లను విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఆదివారం ఎస్ఐ గౌస్‌బాషా దాడులు నిర్వహించి దాసరి నరసింహులును అరెస్టు చేసి, అతడి నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. మండల వ్యాప్తంగా మట్కా, పేకాట, ఇసుక అక్రమ రవాణా తదితర అసాంఘిక కార్యక్రమాలపై పోలీసుల దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపిక



ప్రతిభ కనబరిచిన విద్యార్థితో పీడీ

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన దర్శన్‌తేజ్ జూడో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 19న అనంతపురంలోని గుడ్ చిల్డ్రన్ స్కూల్‌లో స్కూల్ గేం అండర్-14 జూడో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారన్నారు. జెడ్పీ హైస్కూల్‌లోని 9వ తరగతి చదువుతున్న దర్శన్ తేజ్ ప్రతిభ కనబరిచి ఈ నెల 23న తిరుపతిలో జరిగే స్కూల్ గేం ఫెడరేషన్ జూడో అండర్-14 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని పీడీతోపాటు ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, ఉపాధ్యాయులు, లలితమ్మ, అంకిరెడ్డి, అభినందించారు.

జూదరుల అరెస్టు

యాడికి: పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ7,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఈరన్న తెలిపారు. మండలంలోని రామరాజుపల్లి సమీపంలో కొంత కాలంగా పేకాట ఆడుతున్నారనే సమాచారం రావడంతో సీఐ తన సిబ్బందితో ఆదివారం సాయంత్రం దాడి చేశారు.